www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024
5
అన్నమయ్య



హోటళ్లల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



హోటల్లో తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : పట్టణంలోని పలు హోటళ్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు వంటగదులు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని హోటల్ యజమానులకు సూచించారు. పరిశుభ్రత పాటించని హోటళ్లపై జరిమానా విధిస్తామని, వండిన ఆహార పదార్థాలపై కచ్చితంగా మూతలు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. త్వరలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, వాణిజ్య సముదాయాల సహకారంతో ప్లాస్టిక్ నిషేధం, వాటిని వాడడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చేదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, హెల్త్ అసిస్టెంట్ తిరుమలరావు పాల్గొన్నారు.



నిరాశాజనకమే

- వ్యవసాయ కోటాలో తగ్గుదల
- ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
- రైల్వేలైన్ల ప్రస్తావనేదీ?
- వేతన జీవులకూ నిరాశే

కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఓట్ ఆన్ బడ్జెట్‌ను గురువారం సుమారు రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. విభజన హామీలను విస్మరించింది. కార్పొరేట్ల ప్రోత్సాహకాలు, పాడి రైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకాన్ని ఉటంకించింది. వేతనజీవులను నిరాశ పరిచింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడాన్ని విస్మరించి అధికం చేస్తామని పేర్కంది. గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.25 లక్ష కోట్లకు రూ. రెండు లక్షలను జత చేసి అత్తెసరు కేటాయింపులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/రాయచోటి

కేంద్ర బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తావనే కొరవడింది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా-సీతారామన్ 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల కేటాయింపుల జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పెండింగ్ నిధులు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. రూ.2.55 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలు తెలియడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే ప్రధానమంత్రి తన హామీనే విస్మరించి అధికం చేస్తామనే ప్రకటనకు పరిమితం కావడం గమనార్హం. వ్యవసాయ అనుబంధ రంగాలైన గ్రామీణాభివృద్ధికి రూ.1.77 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది వ్యవసాయాభివృద్ధికి రూ.1.32,513 లక్షల కేటాయింపులను రూ.1.27 కోట్లకు కుదించింది. ఉమ్మడి జిల్లాలోని సుమారు ఐదు లక్షల మంది రైతుల్లో ఎందరికి ప్రయోజనాలకు కోతపడుతుందో తెలియడం లేదు. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకపోవడం నిరాశను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది.

రైల్వే బడ్జెట్ రూ.2.55 కోట్లతో ప్రవేశపెట్టింది. గతేడాది 2.40 లక్షల కోట్ల నుంచి కొంతమేర పెంపుదల కనిపించింది. కానీ ప్రాజెక్టుల వారీగా వివరాలు తెలియడం లేదు. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల గడిచిన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి - కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. రూ.86 లక్షల కోట్ల ఉపాధి హామీ పనుల కేటాయింపులు చేసింది. దేశవ్యాప్త ంగా 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది మహి ళలకు మేలు చేస్తామని పేర్కొంది. వీరితోపాటు దేశంలోని అంగన్వాడీలు, ఆశా లను ఆయుష్మాన్‌భారత్ పరిధిలోకి తీసుకుని రావడం కొంత ఉపశమనాన్ని కలి గించింది.

రాష్ట్రానికి తీరని అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గానీ, పోలవరం నిర్వాసితుల విషయం గాని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి ఏ అంశాలు ఈ బడ్జెట్లో లేకపోవడంతో మరొకసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలను వంచించటానికి కేంద్రం సిద్ధమైందని స్పష్టమవు తుందన్నారు. మన రాష్ట్రం నుంచి జిఎస్‌టి వసూళ్ల పెరిగినా రాష్ట్రం వాటా మాత్రం పెరగలేదన్నారు.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

ఎన్నికల బడ్జెట్

2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపల్పన చేసినట్లు కనిపించింది. సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ లేదు. మాటలను చేతలకు పొంతన లేదు. మౌలిక వసతుల కేటాయింపులు ఆదానీ, అంబానీలకే. రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. నిరుద్యోగ సమస్య తాండవం చేస్తోంది. ఎపికి ఎటువంటి హామీ నెరవేర్చిన పాపాన లేదు. ద్రవ్యోల్బణాన్ని పెంచి సామా న్యుల జీవితాలను కడగండ్ల పాలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కడప - బెంగళూరు, విజయవాడ రైల్వేప్రాజెక్టు ఊసేలేదు. స్టీల్‌ప్లాంట్, పోలవరానికి దిక్కు లేదు.

- జి.ఈశ్వరయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

మోసకారి బడ్జెట్

కేంద్ర బడ్జెట్ మేడిపండు చందం. రైతులు, యువత, మహిళలు, పేదల స్తంభాల మీద బడ్జెట్ పెట్టినట్లు చెప్పింది. లోతులను పరిశీలిస్తే లోన లొటారం పైన పటారమే. రైతులు ఆశించిన పిఎం కిసాన్ రూపాయి పెంచలేదు. వ్యవ సాయ రుణాలు రద్దు చేస్తారని నిరాశ కలిగించింది. మహిళలకు గ్యాస్, నిరుపేదలకు డిబిటి చేస్తార ఆశల్ని అడియాశలు చేసింది. 14 లక్షల కేంద్ర ఉద్యోగాల భర్తీ చేస్తారని ఆశించిన యువతను నిరాశ పరిచింది. ఎపికి టోపీ పెట్టింది. ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, కడప స్టీల్, దుగ్గరాజపట్నం ఓడరేవు, విశాఖ మెట్రో, రైల్వేజోన్ వంటి హామీలను విస్మరించింది.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్.

పథకాల అమలులో లక్ష్యాలను అధిగమించాలి

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని సచివాలయాలలో జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, స్త్రీ, శిశు సంక్షేమం-ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ పథకం, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, కరువు మండలాల్లో వేతన ఉత్పత్తి, తాగునీరు సరఫరా, పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు, సిసిటివి ప్రాజెక్టు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆంఒ సత్యనారాయణ హాజరయ్యారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశంలో భాగంగా చుక్కల, ఇనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు కనీస సౌకర్యాలు ఉండాలని ముఖ్యంగా ర్యాంపు, మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. జిల్లాలో మూడో దశ రీ సర్వేలో సుమారు 20 వేల పైగా ఎకరాలు సర్వే చేయాల్సి ఉందని, సదరు రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అంశంలో భాగంగా డేటా అందుబాటులో ఉన్న ప్రతి సచివాలయంలో కనీసం ఒక రిజిస్ట్రేషన్ అయిన తప్పని సరిగా చేయాలన్నారు. పంచాయతీ సెక్రెటరీలను రిజిస్ట్రేషన్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. మహిళా శిశు సంక్షేమంలో భాగంగా గోరుముద్ద, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అంశంపై సిపిడబ్ల్యూ పథకం వివాహంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో నీటి సరఫరా అంశంపై వాస్తవ పరిస్థితులపై నివేదిక సమర్పించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ విజేత హర్యానా



ఛాంపియన్‌షిప్ కప్పును అందుకుంటున్న హర్యానా జట్టు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీలలో జాతీయ స్థాయి విజేతగా హర్యానా జట్టు కప్పు అవలీలగా కైవసం చేస్తుంది. రాజస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 43 పాయింట్లు తేడాతో ఘన విజయం సాధించింది. రాజస్థాన్ రన్నరప్‌గా నిలువగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ జట్లు మూడు నాలుగు స్థానాలలో నిలిచాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆర్‌ఐపి ఇ.భానుమూర్తి రాజు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, వైసిపి సంయుక్త రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు పాల్గొని జాతీయ స్థాయి విజేత హర్యానా జట్టుకు ఓవరాల్ ఛాంపియనిషిప్ కప్పును, రాజస్థాన్‌కు రన్నరప్ కప్పు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ జట్లకు మూడు, నాలుగు స్థానాల కప్పులను అందజేశారు. ఆది నుంచి అత్యంత ప్రతిభ కనబరుస్తూ ప్రత్యర్థి జట్లుకు సవాల్ విసురుతూ ధీటైన ప్రదర్శనతో ఆకట్టుకుని విజేతగా నిలిచిన హర్యానా జట్టుకు విమర్శకుల ప్రశంసలు లభించాయి. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శివ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావడంతో క్రీడా ప్రాంగణం కోలాహలంగా మారింది.



కలెక్టరేట్‌లోని విభాగాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కిషోర్

రికార్డులను పటిష్టంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

కలెక్టరేట్‌ను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రతి విభాగంలోనూ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టరు గురువారం జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణతో కలిసి కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలను, చుట్టూ పక్కల పరిసరాలను కలియ తిరిగి పరిశీలించారు. ప్రతి విభాగానికి వెళ్లి అక్కడ ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు, రికార్డుల నిర్వహణ తదితరాలను పరిశీలించి ఆ విభాగంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫర్నిచర్ ఎక్కడ పడితే అక్కడ ఉంచకుండా వాటిని సరిగా ఉపయోగించుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో కొన్ని చోట్ల గోడలు వెలిసిపోయినట్లు ఉన్నాయని వాటికి పెయింటింగ్ చేయించాలని ఎఒను ఆదేశించారు. కలెక్టరేట్ చుట్టూ పక్కల పరిసరాలలో కూడా పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఆస్పత్రులకు ఎలాంటి అనుమతుల్లేవ్

- డిఎంహెచ్‌ఒ కార్యాలయ డిప్యూటీ డెమో డి.శిరోమణి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి పట్టణంలోని ప్రవీణ్ న్యూరో, రెయిన్‌బో ఆస్పత్రిలకు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని డిఎంహెచ్‌ఒ కార్యాలయ డెమో డి.శిరోమణి తెలిపారు. గురువారం మదనపల్లిలోని పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రవీణ్ న్యూరో, రెయిన్‌బో ఆస్పత్రిలకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఏడాదన్నర కాలంగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి చట్టవ్యతిరేకంగా వ్యవహారిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి చట్టవ్యతిరేకంగా వ్యవహారిస్తున్న అస్పత్రుల నిర్వాహకులపైచట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఎంహెచ్‌ఒ అదేశాలతో ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. పట్టణంలోని ఆధ్య ఆస్పత్రి తనిఖీ చేయగా అక్కడ నిర్వాహకులు రోగుల వద్ద తీసుకునే ఫీసుల వివరాల బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రవీణ్ న్యూరాలజి ఆస్పత్రి తనిఖీ చేస్తే విస్తుపోయే వాస్తవాలు బయటప డ్డాయన్నారు. ఆసుపత్రికి ఎలాంటి అనుమతులే లేవని పేర్కొన్నారు. ఉన్నతా ధికారులు ఆదేశాలతో మదనపల్లిలోని ప్రయివేట్ ఆస్పత్రులపై రైడ్ చేయగా అక్రమాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆసుపత్రిని నడుపుతూ రోగుల ప్రాణాలతో డాక్టర్లు చెలగాటమాడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్లపై కఠిన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. రెయిన్‌బో ఆస్పత్రికి వెళ్ళగా అక్కడ కూడా అదే పరిస్థితి ఉందని చెప్పారు. అనుమతులు లేకుండా ఆస్పత్రిని నడపడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడే ఎలాంటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

రాజకీయాలు వేగంగా మారుతున్నాయి

- బిజెపితో జతకడితే టిడిపికే నష్టం
- రాష్ట్రంలో బిజెపికి ఉనికే లేదు
- పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కవు
- షర్మిల కేంద్రాన్ని ప్రశ్నించడాన్ని స్వాగతిస్తున్నాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రాజకీయ పరిణా మాలు వేగంగా మారు తున్నాయని, వైసిపికి నష్టం కలిగే పరిణామాలు చోటు చేసుకుం టున్నాయని, 175కి 175 సీట్లు సాధిస్తామన్న సిఎం జగన్ మోహన్‌రెడ్డి సొంతపార్టీ ఎమ్మె ల్యేలు ఓడిపోతారన్న పేరుతో అభ్యర్థులను మార్చు కుంటు న్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వామపక్ష పార్టీలే బిజెపిని ప్రశ్నిస్తూ వచ్చాయని, ఇప్పుడు ఎపిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.షర్మిలా కేంద్రాన్ని నిలదీయడం ప్రారంభించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి దాసోహమైపోయాయని చెప్పారు. ఇప్పుడు టిడిపికి మంచి అవకాశం వచ్చిందని, దీన్ని దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. అధికారంలోకి వస్తామని టిడిపి చంకలు గుద్దుకోవద్దని, రాష్ట్రంలో బలం లేని బిజెపితో జతకడితే వామపక్ష, సెక్యులర్ సంఘాలు దూరమవుతాయని హెచ్చరించారు. ఈ విషయాన్ని టిడిపి ఇప్పటికైనా గుర్తించాలని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ప్రశ్నించే వారిని, ప్రతిపక్ష పార్టీల నాయకుల మీదికి కేంద్ర ప్రభుత్వం సంస్థలు ఇడి, ఐటి దాడులకు ఉసిగొలుపుతుందని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలను బిజెపి గుత్తాదిపత్యంతో నిలువరించాలని చూస్తుందని తెలిపారు. బీహార్. సిఎం నితీష్‌కుమార్‌ను బెదిరించి బిజెపి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిందని పేర్కొన్నారు. షర్మిలా వచ్చాక జిల్లాలో మార్పులు చోటుచేసు కున్నాయని చెప్పారు. టిడిపి, కాంగ్రెస్ మధ్య సయోధ్య కుదిరితే వైసిపి అభ్యర్థులు ఓడిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సమవేశంలో అనేక విషయాలు చర్చించామన్నారు. బిజెపిని ఓడించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మరుస్తారని హెచ్చరించారు. అధ్యక్ష పాలనవస్తుందని తెలిపారు. ప్రతిపక్షాలను, నిలదేసే వారిని బిజెపి సహించడం లేదని చెప్పారు. బిజెపిని ఓడించడమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో సిపిఎం, సిపిఐ, మరి కొన్ని వామపక్షపార్టీలు, ప్రత్యేక సాధన కమిటీ, కాంగ్రెస్‌ను సర్దుబాటు చేయడానికి సిపిఎం ముందుకు పోతుందన్నారు. జనసేన బిజెపిని భుజనవేసుకుందని పేర్కొన్నారు. టిడిపి వచ్చేఎన్నికల్లో అవకాశాలను జారవిడుచుకుంటే నష్టపోతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో బిజెపి తరుపున పురందరేశ్వరి, విష్ణువర్ధన్‌రెడ్డి పోటీచేసినా డిపాజిట్లు రావని చెప్పారు. రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకుందా అని ప్రశ్నించారు. దేశానికి రక్ష మోడీ అనడంలో వాస్తవం లేదని, గతంలో మోడి లేకపోయినా దేశ సురక్షితంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు దేశాన్ని రక్షించుకుంటారని చెప్పారు. బిజెపితో పోతే టిడిపికి సమాధే అని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, నగర కార్యదర్శి ఎ.రామమోహన్, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ పాల్గొన్నారు.

బిజెపికి రాజకీయ సాధనాలుగా ఇడి, సిబిఐ

బిజెపికి రాజకీయ సాధనాలుగా ఇడి, సిబిఐ వాడుకుంటూ ఉందని, ఆ పార్టీ చేతిలో టిడిపి, వైసిపి జనసేన కీలు బొమ్మలుగా మారాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ అన్నారు. సిపిఎం జిల్లా విస్తృత సమావేశం గురువారం జిల్లా కార్యాలయంలో ఐ.ఎన్.సుబ్బమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ ప్రజల ప్రయోజనాలను కోసం నిలబడే ప్రాంతీయ పార్టీలను ఇవాళ బిజెపి ప్రభుత్వం ఇడి, సిబిఐలను ఉపయోగించి బెదిరించడం చాలా బాధాకరమైన విషయమని తెలిపారు. దేశంలో త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి మతోన్మాద పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వామపక్షాల ఐక్యత కోసం సీట్లు సర్దుబాటులు ఉంటాయని స్పష్టం చేశారు.

ఎంపిడిఒ సేవలు ఆదర్శనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంబేపల్లె ఎంపిడిఒ నరసింహులు అందించిన సేవలు అభినందనీయం, ఆదర్శనీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహులు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసింహులు మండలంలో విశేష సేవలందించి ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందించడంలో కానీ, గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనుల వేగవంతంలో నరసింహులు చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. వారి శేష జీవితం ఆనందంగా, సుఖమయంగా సాగాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అనంతరం డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీలక్ష్మీ, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకటరమణారెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ సుధాకర్‌రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు, నాయకులు సిబ్బంది కలిసి ఎంపిడిఒ నరసింహులును శాలువాలు వేసి పూలబొకేలత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపిలు పొత్తూరి రవీంద్ర నాయుడు, మీసాల భాగ్యమ్మ, సీనియర్ నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, వసంత శ్రీనివాసులు రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, సర్పంచ్‌లు అంచల రామచంద్ర, నాగరాజు యాదవ్, అమరనాధ రెడ్డి, మండలంలోని ఇతర శాఖల అధికారులు, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్లకు చెల్లించాల్సిన డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్ ఎపిజిఎల్ఐ పిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధపడాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజంపేటలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం ఖాతరు చేయకుండా మొండిగా వ్యవహారిస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యోగుల మొఖంలో చిరునవ్వుతో పనిచేసే విధంగా సకాలంలో అన్ని ఇస్తామని ఫ్రెండ్లీ ప్రభుత్వంగా వుంటామని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి నేడు ఉద్యోగులకు తీరని నష్టం కలిగిస్తూ వారిని దుఃఖంలో ముం చెత్తారన్నారు. మంత్రి వర్గ సమావేశంలో ఆర్థిక బకాయిలు, మధ్యంతర భృతి మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, నాయకులు నాగేంద్ర, నరసింహారావు, మాధవ మూర్తి, ఉపాధ్యాయులు చిన్నగంగయ్య, శశిధర్, సిద్దేశ్వర ప్రసాద్, యల్లయ్య పాల్గొన్నారు.

జనసేన, టిడిపి కూటమిని గెలిపించండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజల సమస్యలు గుర్తించి వాటి వాటి పరిష్కారానికి కృషి చేసేందుకే జనంలో జనసేన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని నియోజకవర్గ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. గురువారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు మండల పరిధిలోని ఊటుకూరు, వెంకటరాజంపేట తదితర గ్రామాలలో పర్య టించి పార్టీ గుర్తు గాజు గ్లాసును ప్రజలకు పరిచయం చేస్తూ ప్రజలకు వివరిం చారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందా లంటే జనసేన, టిడిపి కూటమిని ఎన్నికలలో గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, జనసేన నాయకులు సింగంశెట్టి నరేంద్ర, కోలాటం హరికృష్ణ, నంద్యాల హరి, అబ్బిగారి గోపాల్, నాగరాజ, చలపతి, మల్లి, గురుప్రసాద్, మురళి, నరసింహ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరాజు



ఆర్‌టిసి బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

బస్టాండ్‌లో బస్సులు నిలవడానికి స్థలం ఎక్కడ?

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్ బైక్, ఆటో స్టాండ్‌ను తలపిస్తోంది. ఇక్కడి నుంచి అనంతపురం, రాజంపేట, నెల్లూరు, బెంగళూరు, మదనపల్లి, పులివెందల, కడప, బళ్లారి వంటి ప్రాంతాలకు ఆర్‌టిసి సర్వీసులు తిరుగుతుంటాయి. రాయచోటి, కదిరిడిపోకు చెందిన 35 బస్సులు, మదనపల్లి డిపో చెందిన 14 బస్సు సర్వీసులు నిత్యం బస్టాండ్ వచ్చిపోతుంటాయి. బస్టాండ్‌లో బస్సు నిలవాల్సిన స్థలంలో బైక్‌లు, ఆటోలు ఉండటంతో డ్రైవర్లు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ద్విచక్ర వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు స్టాండ్‌గా మారిపోయిందని వారు ఆవేదన చెందుతున్నారు. కూరగాయల సంత జరిగే సమయంలో బస్సులు నిలిపేందుకు మరింత అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు ఇష్టాను సారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు గాలివీడు బస్టాండ్‌పై దృష్టి సారించి బస్టాండ్‌లో ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఎస్ఐగా లోకేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



నిమ్మనపల్లి ఎస్ఐగా సి.లోకేష్‌రెడ్డి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న పి.రామకృష్ణ సంబేపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐగా పనిచేస్తున్న సి.లోకేష్‌రెడ్డి నిమ్మనపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు-పోలీసులు మధ్య సత్సంబంధాలు ఉండాలని, ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణాన్ని ఏర్పాటు చేయాల న్నారు. మండల పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరిం చటానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



జన్మించిన పురిటి బిడ్డతో తల్లి

108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన నిమ్మ నపల్లి మండలంలో గురువారం జరిగింది. మండల పరిధిలోని చౌకిల్లవారిపల్లెకు చెందిన సయ్యద్‌బాషా భార్య తంసన్(23) తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఇఎంటి రెడ్డిజస్వంత్, పైలెట్ అమరనారాయణ, ఆమెను నిమ్మనపల్లె వైద్యశాలకు తరలి స్తుండగా మార్గం మధ్యలోనే పండంటి ఆడబిడ్డకు వాహనం లోనే జన్మనిచ్చింది. అనంతరం ఆమెను నిమ్మనపల్లి వైద్యశాలకు తరలించి చికిత్స అందించి, ప్రసవానంతరం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన బి.కొత్తకోట కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిషిక్త్ కిషోర్‌ను గురువారం బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ కమిషన్ మనోహర్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రోటో కాల్ ప్రకారం కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. కలెక్టర్ సూచనలు, సలహాలు స్వీకరించి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

హార్సిలీహిల్స్‌లో పులుల సంచారం

- భయం గుప్పిట్లో పర్యాటకులు, ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో రెండు పులులు పులులు సంచరిస్తుండడంతో పర్యాటకులు, ప్రజలు భయం గుప్పెట్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల పులులు సంచరించడం తాము చూసినట్లు టూరిజం ఉద్యోగి మధనమోహన్, సురేష్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదట పంపుహౌస్ దగ్గర, రేణిమాను మలుపు వద్ద తిరుగుతున్నట్టు గమనించామని అన్నారు. పులులను పట్టుకో వడానికి అటవీశాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



రెడ్డిలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వాలంటీర్

మండల పరిధిలోని ఎర్రసానిపల్లెకు చెందిన రెడ్డిలక్ష్మి మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలయింది. మెరుగైన వైద్య చికిత్సల కోసం ఆమె బంధువులు తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్చారు. విషయం తెలుసుకున్న మూలపల్లి వాలంటీర్ ప్రశాంత్ ఆమె పరిస్థితిని గుర్తించి గురువారం తెల్లవారుజామున తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రెడ్డి లక్ష్మికి పింఛన్‌ను పంపిణీ చేశారు. క్లిష్ట పరిస్థితిలో ఎంతో కొంత ఆర్థిక సాయం పెన్షన్ ద్వారా ఆర్థిక సాయం అందడంతో కొంత ఊరట కలుగుతుందని వాలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వాలంటీర్‌ను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అభినందించారు.

ఘనంగా షాజహాన్‌బాషా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి




షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మదనపల్లె మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు షాజహాన్ బాషా జన్మదిన వేడుకలను అభిమా నులు, నాయ కులు మధ్య నిర్వహించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన నాయ కులు, కార్యకర్తలు అభిమానుల మధ్య కట్ చేసి ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి అధికారాన్ని జేక్కించుకుందామని పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు నాదెండ్ల విద్యాసాగర్, శివప్రసాద్, నవీన్ చౌదరి, జనసేన నాయకులు రాందాస్ చౌదరి, జంగాల శివ రామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ధ్యేయం : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చీమల చెరువుపల్లె, అరవీడు, రాయచోటి మండలంలోని యండపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు వేర్వేరుగా జరిగిన భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతి ప్రాంతానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇటీవలనే గాలివీడు సమీపంలో రూ.28.44కోట్ల వ్యయంతో 31.5 ఎంవిఎ సామర్థ్యం గల 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో 43 వేల మంది వినియోగదారులకు లబ్ధిపొందుతున్నారని అన్నారు. తూముకుంట వద్ద 100 మెగా వాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి ముఖ్య మంత్రి జగన్ వర్చువల్ విధానం ద్వారా శంఖుస్థాపన చేయడంతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పొత్తుకూరుపల్లె, నారా యణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు. నేడు గాలివీడు మండలంలో చీమలచెరువుపల్లె, అరవీడు, రాయచోటి రూరల్ మండలంలోని యండపల్లె వద్ద 33/11 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంఖుస్థాపనలు జరగడం హర్షణీయమన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామ న్నారు. పట్టణంలోని గుణ్ణికుంట్ల రింగ్ రోడ్డు, సంబేపల్లె మండలం రౌతుకుంట, గాలివీడు గుండ్లచెరువు, కొర్లకుంట, లక్కిరెడ్డిపల్లె మండలంలోని దప్పేపల్లె లలో 33/11 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ జరుగుతోందని, ఇది పూర్తయిన వెంటనే నిర్మాణాలు జరుగుతాయన్నారు. పెద్దమండెం మండ లం బండివాండ్లపల్లి దగ్గర హంద్రీనీవా లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నిర్మించిన



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

132/33 సబ్‌స్టేషన్ నుంచి గాలివీడు కు కొత్త 33కెవి లైన్‌ను 10.5 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించి గాలివీడు లో ఓల్టేజీ సమస్యలును పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జల్లా పద్మావతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, ఎపిఎస్ పిడిసిఎల్ ఒఎస్‌డి శ్రీనివాసులు, ఎస్ఇ రమణ, ఇఇ చంద్రశేఖర్ రెడ్డి, కన్ స్ట్రక్షన్ ఇఇ నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షులు వేదమూర్తి రెడ్డి, ఆవుల నాగభూషణ్ రెడ్డి, ఎఇ నరేంద్రా రెడ్డి, మండల మైనార్టీ నాయకులు ఖాదర్ మోద్దీన్, వైస్ ఎంపిపి గాలి శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌కు సన్మానం



నరసింహులును సన్మానిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల వనరుల కేంద్రంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న నరసింహులను మండల విద్యాశాఖ అధికారులు ఎంఆర్ పద్మావతి, నారాయణ ఉపాధ్యాయ బృందంతో కలిసి ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒలు ఉపాధ్యాయ బృందం నరసింహులను అభినందించారు. 2023-24 విద్యా సంవత్సరంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులు ఫేషియల్ యాప్ (ముఖ ఆధారిత) ద్వారా నూరు శాతం హాజరు నమోదు చేయడం, సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల అమలుపై చక్కని పనితీరు కనబరుస్తున్నారని ఎంఇఒలు ఎమ్మార్ పద్మావతి, నారాయణలు పేర్కొన్నారు. ఆయన చక్కని కృషితో 75వ గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ చేతులమీదుగా అవార్డు అందు కోవడం జరిగింద న్నారు. నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తన సహచర ఉద్యోగుల సహకారంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో జిల్లాలోనే నిమ్మనపల్లి మండలం ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయుటలో రాష్ట్రస్థాయిలో అత్యదికంగా నిమ్మనపల్లి మండలం వందశాతం నమోదు చేయడంతో రాష్ట్రస్థాయిలో ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్రీనివాసులు, సుజాత, మాధవి, ఎంఆర్‌సి సిబ్బంది సౌజన్య, పద్మనాభం, సుధాకర్, స్వాతి, మంజుల, సురేష్, అనురాధ పాల్గొన్నారు.

ఎంపిడిఒ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బదిలీపై వెళుతున్న ఎంపిడిఒను మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరికి బదిలీ తప్పదని ఎంపిడిఒ పి.శేషగిరిరావు అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరు జిల్లా సంగం మండలానికి బదిలీఅయ్యారు. గురువారం ఆయన రిలీవ్ కావడంతో సిబ్బంది ఎంపిడిఒ దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు సేవా భావంతో ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని అన్నారు. అంకితభావంతో పనిచేస్తే వృత్తికి న్యాయం చేకూర్చిన వారమవు తామని చెప్పారు. అభివృద్ధికి కృషి చేసిన తనకు అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ శశి, జూనియర్ అసిస్టెంట్ రూపేష్, నవాజ్ ఖాన్, ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ శేషగిరిరావు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం సచివాలయాలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు నిలు స్తున్నాయని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని లక్కిరెడ్డిపల్లె-1 సచివాలయంలో ఒకే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ రైతుభరోసా, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ భవనాలును, లక్కిరెడ్డిపల్లె -2 సచివాలయ పరిధిలో గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వ్యయ, ప్రయాసలు లేకుండా చేశారని చెప్పారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. గ్రామ సచివాలయాలకు కోట్లాది రూపాయలుతో శాశ్వత కార్యాలయ భవనాలను నిర్మించి పల్లెల మార్పుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా కల్పన

జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కల్పనకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డేయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డిలు శాలువాతో సత్కరించి గజమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని కల్పన తెలియజేశారు. తనకు జిల్లా ఉపాధ్యక్షురాలుగా అవకాశం కల్పించిన ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోటమోహన్‌రెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, జడ్‌పిటిసి రమాదేవి, మాజీ ఎంపిపి రెడ్డయ్య లకు కృతజ్ఞతలు తెలిపారు.



కల్పనను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మెగా డిఎస్‌సి ఎన్నికల స్టంటే : జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న రాందాస్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లి

మెగా డిఎస్‌సి ఎన్నికల స్టంట్ అని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి అన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం మెగా డిఎస్‌సి చేస్తామని చెప్పి చేయకుండా ఎన్నికలు దగ్గరకు వస్తున్న సమయంలో 21 వేల పోస్టులు ఉంటే కేవలం ఆరు వేలు మాత్రమే భర్తీచేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీ మిథున్‌రెడ్డి బిటి కళాశాలను ప్రభుత్వ పరం చేశామని జిఒ కూడా అయిపోయిందన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో బిటి కళాశాలను యూనివర్సిటీ చేసేశామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. మదనపల్లికి అన్ని అర్హతలు ఉన్నా జిల్లా కేంద్రంగా ప్రకటించకుండా మరో ప్రాంతానికి తరలించి ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ మండలం అధ్యక్షులు గ్రానైట్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి రెడ్డెమ్మ, సెక్రటరీ నాగవేణి, సరోజ, స్వాతి, లవన్న, రూరల్ మండల ఉపాధ్యక్షులు కుమార్, రామసముద్రం మండల ఉపాధ్యక్షులు గడ్డం లక్ష్మిపతి, రూరల్ మండలం ఉపాధ్యక్షులు చంద్రశేఖర, రాజారెడ్డి, విజయ్ కుమార్, గంగులప్ప, సెక్రటరీ జనార్దన్, నిమ్మనపల్లి ఉపాధ్యక్షులు అఫ్రోజ్, జాఫర్, జెస్వంత్ పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రక్త పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రక్త పరీక్ష కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

వ్యాధి నిర్ధారణ కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తనిఖీ చేసి, ఆసుపత్రిల్లోని సంబంధిత లాబ్ నిర్వహణ అధికారులకు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. గురువారం జిల్లా మలేరియా అధికారి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వ్యాధుల నిర్ధారణ ల్యాబ్‌ను, రిపోర్టులు, రికార్డులు నిర్వహిస్తున్న విధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైద్య ఆరోగ్యశాఖ విధుల నిర్వహణలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్న దృష్ట్యా, రిపోర్టుల రూపకల్పన ఆవశ్యకతను, ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం తెలిపే యాప్‌ల నిర్వహణలో మెలకువలను సిబ్బందికి వివరించారు. మలేరియా, డెంగీ నిర్మూలనకు తోడ్పాటు, ఆవశ్యకతను గుర్తుచేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జున, సిద్దు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల గ్రామానికి చెందిన పాపిరెడ్డి చెరువు ఆయకట్టు రైతులు కొందరు తమ పొలాలకు దారి లేకుండా, పండించిన పంటకు కల్లం చేసుకోవడానికి ఉపయోగించే కల్లం బండ ప్రభుత్వ భూమిని కలిచెర్లకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలిచెర్ల రెవెన్యూ గ్రామపరిధిలో సర్వే నెంబర్ 786 లోఉందని, రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వివిధ రకాల చెట్లును నాటుకున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లామని రైతులు తెలిపారు.



రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ల కోసం వేచివున్న ప్రజలు

రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-చిట్వేలి

రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెల నుంచి రిజిస్టర్లు లావాదేవీలు జరుగుతున్నా డాక్యుమెంట్లు మాత్రం ఏ ఒక్కరికీ అధికారులు ఇవ్వకపోవడంతో గురువారం రిజిస్టర్ కార్యాలయం దగ్గర గందరగోళం నెలకొంది. వృద్ధులు, చంటి బిడ్డతల్లులు గంటలు కొద్ది రోజుల తరబడి నిరీక్షిస్తున్నా పరిష్కారం దొరకని ఏర్పడింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ డాక్యుమెంట్ కోసం రోజుల తరబడి తిరిగినా రేపు మాపు అంటూ, నెట్‌వర్క్ సమస్య ఉందని కాలయాపన చేస్తున్నా రని అన్నారు. అత్యవసరం నగదు కోసం రిజిస్టర్ చేయించినా డాక్యుమెంట్లు రాకపోవడం వలన అనేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. డాక్యుమెంట్ల జాప్యంపై రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళితే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. ఇసి నకలు లాంటివి తీసుకున్నా లబ్ధిదారునికి తెలి యకుండా మారిపోతున్నాయని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డాక్యుమెంట్ల జారీలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-గాలివీడు



మొక్కలు నాటుతున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి మండల మైనార్టీ యువ నాయకుడు ఎస్.కె నిజాముద్దీన్ చొరవతో గాలి వీడు పంచాయతీ పెద్దూర్ కస్పాల్లో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో మొక్క లు నాటారు. ఇలా ప్రతి ఒక్కరూ వైసిపి యువనాయకుడు ఎస్‌కె.నిజా ముద్దీన్ ఆదర్శంగా తీసుకొని పాఠ శాలలు, దేవాలయాలు, మసీద్‌లు, చర్చిల ఆవరణంలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-2 గాలి శ్రీని వాసులు, తంగాల గంగాధర, వేంపల్లి షమీర్, అమీన్, గంగాధరనాయుడు, భాస్కర్‌రెడ్డి, డిష్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

నైతిక విలువలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని కొత్తబోయినపల్లెలోని ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో బాలబాలికలకు నైతిక విలువల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ పిల్లల కోసం 20 నైతిక విలువలు ప్రారంభ దశలోనే నేర్పించాలని, అవి పిల్లలను మంచి వ్యక్తిగా మార్చడానికి దోహదం చేస్తాయని తెలిపారు. లయన్ అబ్దుల్లా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడే విభిన్న నైతిక విలువలు నేర్పించాలని, వాటి గురించి అవగాహన కల్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు, వేణు గోపాల్ నాయుడు మాట్లాడుతూ నైతిక విలువలు ఒక వ్యక్తి రోజువారీ ఎంపికలు చేయడంలో సహాయపడతాయని, తప్పొప్పులను నిర్ణయించి వారి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు నాయుడు, ఉపాధ్యాయులు టిఎండి. షఫీ, ఎస్.శారద, డి.శ్రీలత, పి.శివయ్య, పి.జనార్దన్, దండుసుబ్బారెడ్డి, కె.వి.రమణనాయుడు, ఎస్.వి.రామ రాజు, ఎన్.అమరావతి, ఎ.శివ ప్రసాద్, ఎస్.ప్రభాకర్ రావు, మజ్జారి చెన్న కేశవులు, పిఎల్ఎన్‌వి.ప్రసాద్ రావు, పిడిఎం ఈశ్వర్ నాయక్, పి.విజయ బాస్కర్, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

మదనపల్లె సమీ పంలో గల మిట్స్ ఇంజినీరిర్ కళాశాలలో బి.టెక్ సిఎస్ఇ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదు వుతున్న శృతి, దీక్షితలు హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి జెఎంటియు అనంతపూర్ ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్‌లో యూనివర్సిటీ టీంకు ఎంపికైనట్లు కళాశాల ప్రినిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. వీరు సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే పోటీలలో యూనివర్సిటీ తరుపు ఆడతారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

క్రైం కార్నర్



నిందితుల అరెస్టును చూపుతున్న సిఐ శేఖర్

వ్యాపారి హత్య కేసులో అన్నదమ్ములు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లి

వ్యాపారిని హత్య చేసిన కేసులో అన్నదమ్ములను మదనపల్లి తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తాలూకా సిఐ ఎన్.శేఖర్, ఎస్ఐలు రవి కుమార్, మోహన్‌నాయక్‌లు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని కొత్త ఇండ్లు పంచాయతీ, మునిసిపల్ పార్కు సమీపంలోని భవానినగర్‌లో నివాముున్న సయ్యద్ చాంద్‌బాషా(68) చిల్లరదుకాణం నిర్వహిసున్నాడని తెలిపారు. అదేప్రాంతానికి చెందిన అన్నదమ్ములు షబ్బీర్, షాజహాన్ ఈ నెల 22న దుకాణంలో సరుకులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. చిల్లర కోసం దాడిచేసి హత్యయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ 27న మృతి చెందాడని చెప్పారు. దాడి కేసును హత్య కేసుగా మార్చి నిందితులను స్థానిక బసినికొండలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.